వినాయకుని సేవలో ప్రద్యుమ్న

వినాయక స్వామి సేవలో ప్రద్యుమ్న

ప్రజాశక్తి-ఐరాల: ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న మంగళవారం కాణిపాక వినాయక స్వామి ఆలయానికి విచ్చేశారు. కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కలెక్టర్ స్వామివారి చిత్రపటాన్ని ఆయనకు అందజేశారు. కలెక్టర్ సుమిత్ కుమార్, జెసీ విద్యాధరి స్వాగతం పలికారు.

వైభవంగా శ్రీవారి గరుడసేవ





ప్రజాశక్తి-తిరుమల

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన మంగళవారం రాత్రి శ్రీ మలయప్ప స్వామివారు తనకు ఎంతో ప్రీతిపాత్రమైన గరుడ వాహనంపై లక్ష్మీకాసుల మాల ధరించి భక్తులకు అభయమిచ్చారు. సాయంత్రం 6.30 గంటలకు గరుడసేవ ప్రారంభమైంది. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బందాలు భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష్టితో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి శ్రీవారిని దర్శించుకున్నారు.

గరుడ వాహనం - సర్వపాప ప్రాయశ్చితం

పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాలలోనూ గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. గరుడవాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని తెలియజెబుతారు. అంతేగాక జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే భగవద్భక్తుడైన గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజెబుతున్నాడు. వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్.వెంకయ్య చౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్వో శ్రీధర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉదయం 5 గంటల నుంచి భక్తులకు అన్నప్రసాదాలు

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడ వాహన సేవను దర్శించేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు గ్యాలరీల్లో వేచిఉన్నారు. ఉదయానికల్లా గ్యాలరీలు భక్తులతో నిండాయి. ఉదయం 5 గంటలకు భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభమైంది. తూర్పు-పశ్చిమ-ఉత్తరం-దక్షిణ మాడవీధుల్లో గల 200కు పైగా గ్యాలరీల్లో దాదాపు 2 లక్షల మంది భక్తులు కూర్చున్నారు. భక్తుల కోసం ఉదయం 5 నుండి 6 గంటల మధ్య పాలు, కాఫీ, ఉదయం 6.30 నుండి 8 గంటల మధ్య ఉప్మా, పొంగళి పంపిణీ చేశారు. ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఉదయం 10 గంటలకు సాంబార్ అన్నం, టమాటా అన్నం, స్వీట్ పొంగల్ అందించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి దాదాపు 3 గంటల వరకు భక్తులకు రెండు లక్షలకు పైగా పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. సాయంత్రం సుండల్, కాఫీ, పాలు మళ్లీ పంపిణీ చేశారు. సాయంత్రం 6.30 గంటలకు గరుడవాహనం ప్రారంభం కానుండగా ఉత్తర, తూర్పు మాడ వీధుల్లో సాయంత్రం 6 గంటల వరకు వెజిటబుల్ కిచిడీ పంపిణీ చేశారు.

గ్యాలరీలలో ఏర్పాట్లను పరిశీలించిన ఈఓ, అదనపు ఈవో

టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మంతో కలిసి గ్యాలరీలను పరిశీలించి భక్తులకు అందజేస్తున్న అన్నప్రసాదాలు, తాగునీరు, మరుగుదొడ్లు ఇతర సౌకర్యాలపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. టీటీడీ అందిస్తున్న సేవలపై భక్తులు హర్షం వ్యక్తం చేశారు. వాహనసేవ పూర్తయ్యే వరకు డిప్యూటేషన్ సిబ్బంది వారికి కేటాయించిన స్థానాల్లో విధులు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో మీడియాతో మాట్లాడుతూ గరుడ సేవను చూడటానికి తిరుమల నాలుగుమాడ వీధుల్లో వేచి ఉన్న భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలను మంగళవారం సాయంత్రం పరిశీలించినట్లు తెలిపారు. గ్యాలరీలలో వేచి ఉండే ప్రతి భక్తుడికీ గరుడ వాహనంపై ఉన్న శ్రీ మలయప్ప స్వామివారి దర్శనం చేయించిన తరువాతే స్వామివారు ఆలయానికి వేంచేస్తారని తెలిపారు. ఇప్పటికే గ్యాలరీల్లో లక్షలాది మంది భక్తులు ఎదురుచూస్తున్నారని చెప్పారు. వారికి అవసరమైన ఆహారం, తాగునీరు, పాలు లాంటి అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. తాను చాలామందితో మాట్లాడానని, అందరూ టీటీడీ ఏర్పాట్లపై సంతృప్తి, సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు. భక్తులకు చిన్న ఇబ్బంది కూడా కలుగకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారని వివరించారు.

శ్రీవారి సేవకులకు ప్రశంసలు

నాలుగు మాడ వీధుల్లో వేచి ఉన్న భక్తులకు తెల్లవారుజాము నుంచి అంకితభావంతో, భక్తిశ్రద్ధలతో సేవలందిస్తున్న శ్రీవారి సేవకుల నిస్వార్థసేవలను టీటీడీ ఈవో కొనియాడారు. దాదాపు 1500 మంది శ్రీవారి సేవకులు ఆహారపొట్లాల ప్యాకింగ్, గ్యాలరీలలో అన్నప్రసాదాల వితరణ, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో తాగునీటి పంపిణీ తదితర సేవలందించారు.

మోహినీ అలంకారంలో జగన్మోహనాకారుడు

మంగళవారం ఉదయం శ్రీ మలయప్పస్వామివారు మోహినీ రూపంలో శృంగార రసాధి దేవతగా సర్వాలంకార భూషితుడై దర్శనమిచ్చారు. పక్కనే మరో తిరుచ్చిపై శ్రీకృష్ణుడు అలంకతుడై అభయమిచ్చారు. ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు స్వామివారు నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బందాలు భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష్టితో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి శ్రీవారిని దర్శించుకున్నారు.

అలరించిన భక్తి సంగీత కార్యక్రమాలు

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తిరుమల నాదనీరాజనం వేదిక, ఆస్థాన మండపంలో టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి సంగీత కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి.

బాల్య వివాహాలను అడ్డుకోవాలి

- స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ హైమావతి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: బాల్య వివాహాలను అరికట్టే అంశంపై ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన జీఓ నెంబర్ 31, 39 గురించి, బాల్య వివాహ నిరోధక అధికారుల అధికారాలు, విధుల గురించి డివిజినల్ స్థాయి ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారి చంద్రశేఖర్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సుబ్రహ్మణ్యం, ప్రొటెక్షన్ అధికారులు శివ శంకర్, రాద రాణి, లీగల్ ఆఫీసర్ వెంకటేశులు, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ నాగమని, వన్ స్టాప్ సెంటర్ మేనేజర్ చందు రాణి, సెల్ లీగల్ కౌన్సిలర్ రేఖ, పలమనేరు, కుప్పం పోలీసు అధికారాలు, విధుల గురించి డివిజినల్ స్థాయి మంగళవారం శిక్షణ కార్యక్రమం చేపట్టారు.

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ

పేట్రేగిపోతున్న లాటరీ మాఫియా, గంజాయి

- కలెక్టర్‌కు టిడిపి అధికార ప్రతినిధి వినతి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లాలోని ప్రజా సమస్యలపై టిడిపి రాష్ట్ర అధికారి ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, నాయకులు మంగళవారం కలెక్టర్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సప్తగిరి ప్రసాద్ మాట్లాడుతూ చిత్తూరు పట్టణంలో పేట్రేగిపోతున్న లాటరీ మాఫియా, గంజాయి మాఫియాని ఉక్కుపాదంతో అనచివేయాలని, చిత్తూరు టు అరగొండ రోడ్డు మరమ్మతులు పునర్నిర్మానం చేయాలన్నారు. తవణంపల్లి మండలం అరగొండ పంచాయతీ చేరాల దళిత వాడ, దొమ్మరపల్లి జొన్న గురుకుల ప్రజలకు ఇంటి పట్టాలు ఇవ్వాలన్నారు. పూతలపట్టు నియోజకవర్గం లో ప్రతి దళిత వాడలో స్మశానానికి దారి సమస్య పరిష్కరించి దారి ఏర్పాటు చేయాలని, ప్రహరీ గోడ ఏర్పాటు చేయాలి కలెక్టర్‌కు విన్నవించినట్లు తెలిపారు. కలెక్టర్‌ను కలసిన వారిలో నాయకులు మధుకుమార్, ధరణి ప్రకాష్ ఉన్నారు.

కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న సప్తగిరి ప్రసాద్

కనకదుర్గమ్మకు పట్టువస్త్రాల సమర్పణ

కనకదుర్గమ్మకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఐరాల: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి తరఫున పట్టువస్త్రాలను విజయవాడ కనకదుర్గమ్మకు సమర్పించారు. మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, ఈవో గురుప్రసాద్‌లు విజయవాడకు చేరుకొని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, డిసి రత్నరాజు, కాణిపాకం దేవస్థానం మాజీ ఛైర్మన్ మణి నాయుడు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని నిరసన

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన జిల్లా నాయకులు డివి మునిరత్నం ఆధ్వర్యంలో మంగళవారం రిలే నిరాహార దీక్ష, నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజులుగా బాధితుల న్యాయమైన రెవెన్యూ సమస్యల పరిష్కారం కొరకు అధికారులకు తెలియజేస్తుంటే పట్టించుకోవడంలేదని అందుకే బాధితులకు అండగా రిలేనిరాహార దీక్ష చేస్తున్నామని అన్నారు. భూములు సర్వే చేస్తామని ప్రజల ద్వారా చలానా కట్టించి సర్వే చేయకుండా కాలయాపన చేస్తున్న సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులు కడుపు మండి రిలే దీక్ష చేస్తుంటే శిబిరం దగ్గరకు రాకుండా తనకు అనుకూలమైన ఓ ప్రజా ప్రతినిధిని పిలిపించి వారి వద్ద సమాధానం చెప్పించిన తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్థసారథి, గుర్రం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వికలాంగుడైన కృష్ణప్ప భూమి సర్వే చేసి అతనికి అప్ప చెప్పాలని, దళిత మహిళ సాలమ్మ భూమి సర్వే చేయాలని, ఎస్సీ, ఎస్టీ సమావేశాలు నిర్వహించాలని, లేనిపక్షంలో రిలే నిరాహార దీక్షను పెద్ద ఎత్తున చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో కర్ణాటక జూనియర్ గద్దర్, సాంబశివ, గంగప్ప, శీన, జనార్ధన్, మునిరత్నం, క్రిష్ణప్ప, లోకేష్, నాగార్జున, ఆనంద, బాధితులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

సమయపాలన పాటించరా..

- సచివాలయ సిబ్బందిపై జెడ్పీ ఛైర్మన్ ఆగ్రహం

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని శంకర్రాయాలపేట గ్రామ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించలేదని జెడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో స్థానిక సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయంలో సిబ్బంది విధులు నిర్వర్తించాల్సిన సమయంలో ఒక్కరు కూడా లేకపోవడం చాల దురదృష్టకరమని వారి పని తీరుకు ఇది నిదర్శనం అన్నారు. కార్యాలయ సిబ్బంది తీసిన తలుపులు, అలానే వదిలేసి వెళ్లిపోయిన సమయంలో సచివాలయంలో ఉన్న ఫైల్, కంప్యూటర్లు ఇతర వస్తు సామాగ్రి గుర్తుతెలియని వాళ్ళు ఎత్తుకెళ్తే అడిగే పరిస్థితి లేదని అన్నారు. స్థానిక ఎంపీడీవో, ఉన్నత అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ విషయమై స్థానిక ఎంపీడీవో బాలాజీని వివరణ కోరగా శంకర్రావుపేట సచివాలయ గ్రామ కార్యదర్శితో మాట్లాడి వివరణ కోరుతానని, నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సచివాలయంలో సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సచివాలయం వద్ద వేచి ఉన్న జెడ్పీ ఛైర్మన్

జాతీయ భద్రతకు బలీయమైన శక్తి భారత వైమానిక దళం

- ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జాతీయ భద్రతకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ బలీయమైన శక్తిగా ఎదిగిందనీ చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. ఇది ప్రపంచంలోనే అత్యంత గౌరవ ప్రదమైన వైమానిక దళాల్లో ఒకటిగా రూపాంతరం చెందిందని ఆయన తెలిపారు. భారత వైమానిక దళం 92వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఎంపీ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ భారతదేశానికి అందిస్తున్న అసాధారణమైన భద్రతా సేవలను ఓ ప్రకటనలో కొనియాడారు. భారత వైమానిక దళం 92 సంవత్సరాల ప్రయాణం.. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడే పరాక్రమం, ఆవిష్కరణ, తిరుగులేని నిబద్ధతకు నిదర్శనమన్నారు. 1932 అక్టోబర్ 8న పురుడు పోసుకున్న ఇండియన్ ఎయిర్ ఫోర్స్ జాతీయ భద్రతకు సంబంధించి, బలీయమైన స్తంభంగా నిలుస్తుందని తెలిపారు. ఈ రోజు కేవలం క్యాలెండర్‌లోని తేదీ మాత్రమే కాదనీ, ఇది శౌర్యం, త్యాగం మన ఆకాశం, దేశ సార్వభౌమాధికారం కోసం తమ జీవితాలను అంకితం చేసిన లెక్కలేనన్ని వైమానిక యోధుల అచంచలమైన నిబద్ధతకు తార్కాణం అన్నారు. మొబిలిటీ, ఇంటెలిజెన్స్, నిఘా, కమాండ్ అండ్ కంట్రోల్‌తో సహా వైమానిక శక్తికి సంబంధించిన అన్ని అంశాలకు మద్దతుగా నిలిచేలా రూపొందించినట్లు పేర్కొన్నారు. వరదలు, భూకంపాలు, తుఫానుల వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయాన్ని అందించడం, విపత్తు సహాయక చర్యలలో ఈ దళం చురుకుగా పాల్గొంటోందన్నారు. విమానాలను, సిబ్బందిని ప్రభావిత ప్రాంతాలకు త్వరగా మోహరించే సామర్థ్యం లెక్కలేనన్ని మంది ప్రాణాలను కాపాడిందనీ, అవసరమైన సమయాల్లో దేశానికి సేవ చేయడంలో దాని నిబద్ధతను ప్రదర్శించిందని చెప్పారు.

భూస్వాముల చేతిలో ప్రభుత్వ భూములు

- తరచూ విద్యుత్‌కు అంతరాయం
- నూతన రోడ్డు ఏర్పాటు చేయండి
- గ్రామానికి భద్రత కల్పించండి
- గుండ్రాజు కుప్పం పంచాయతీ ఓపెన్ గ్రీవెన్స్ డేలో గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి-విజయపురం(నగరి): నగిరి మండల పరిధికి చెందిన ప్రభుత్వ భూములు భూస్వాముల చేతిలో ఉన్నాయని ఫలితంగా తమలాంటి మధ్య తరగతులకు భూములు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశం మేరకు మంగళవారం గుండ్రాజు కుప్పం పంచాయతీలో ఓపెన్ గ్రీవెన్స్ డే సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా నగిరి ఆర్‌డీవో వెంకటరమణ పాల్గొన్నారు. అనంతరం ఆయన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ తన గ్రామ సమీపంలో సుమారు 10కి పైగా క్వారీలు ఉండడంతో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతున్నదని చెప్పారు. అలాగే తమ గ్రామం చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములు కొందరు భూస్వాములు అక్రమంగా ఆక్రమించుకొని పట్టాలు చేసుకుంటున్నారని ఈ విషయం అధికారులు తెలిసినా పట్టించుకోవడంలేదని ఆర్డిఓ దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా కొందరు వీఆర్వోలు భూస్వాములతో చేతులు కలిపి మామూలుకు కక్కుర్తి పడి ప్రభుత్వ భూములను ధారాధాతత్వం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. అలాగే గుండ్రాజకుప్పం నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లడానికి సరైన రోడ్డు మార్గం లేదని రోడ్డులో అక్కడక్కడ గుంతలు ఏర్పడి దారుణంగా మారిందని గ్రావల్ తోలి రోడ్డు బాగు చేయాలని వారు కోరారు. అనంతరం సుమారు 60ఇళ్ల పట్టాలు మారిపోయి ఒకరి పట్టాలో మరోకరు ఇల్లు కట్టేసి ఉన్నారని, వాటిని అధికారులు సరిచేసి పట్టాలు ఇప్పించాలని కోరారు. గ్రామ పరిసరాలలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని తమ గ్రామానికి ప్రత్యేకంగా ఇద్దరు కానిస్టేబుల్ ఏర్పాటు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో వారికి ఫోను చేయడానికి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరారు. ఇది వరలో చైన్ స్నాకింగ్ ఎక్కువగా జరిగిందని ఇలాంటి సంఘటన మరోసారి జరగకుండా పోలీసు యంత్రాంగం తమ పిలుపుమేరకు ఇద్దరు కానిస్టేబుల్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన సీఐ మహేశ్వర్ వెంటనే ఇద్దరు కానిస్టేబుల్‌లను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆర్‌డీవో మాట్లాడుతూ వారి సమస్యలను త్వరలో పరిష్కరించి న్యాయం చేస్తానని ప్రభుత్వ భూములు రికవరీ చేసి భూములు లేని వారికి అందిస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రవికుమార్, ఎంపీడీవో సతీష్, పిఆర్ఏఈ వీరభద్ర, ఇఓపిఆర్డి అరుణ, ఏపీఓ కవిత, అంగన్వాడి సూపర్వైజర్ శంకరమ్మ, ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు, సర్పంచులు బాల ప్రసాద్, ప్రభావతి, టిడిపి నాయకులు లక్ష్మి నారాయణ రాజు, ఉమాపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

'హైరిస్క్ గర్భిణులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి'

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్:

చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి దేవి జిల్లాలోని వైద్యాధికారులకు టీనేజ్ ప్రెగ్నెన్సీ జాగ్రత్తలపై జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 18 సంవత్సరాల లోపల గర్భం ధరించిన వారందరూ కూడా టీనేజ్ ప్రెగ్నెన్సీ కింద వస్తారు. వీరు చాలా హైరిస్క్ గర్భిణీలు, హైరిస్క్ గర్భవతులకు అన్నీ పరీక్షలు నిర్వహించి ప్రణాళిక ద్వారా కాన్పుకు వారం రోజులు ముందుగా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాలన్నారు. వారికి ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. మొదటిసారి గర్భం దాల్చిన గర్భవతులపై వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రధానమంత్రి సురక్షిత అభియాన్, ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన, జననీ సురక్ష యోజన, జననీ శిశు సురక్ష కార్యక్రమం, తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఇలా అన్ని పథకాలను కచ్చితంగా వినియోగించుకునేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు, డాక్టర్లు పాల్గొన్నారు.

జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డాక్టర్ ప్రభావతి దేవి

'విజయం'లో దసరా సంబరాలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగరంలోని విజయం డిగ్రీ కళాశాలలో మంగళవారం ముందస్తు దసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. లక్ష్మీ, సరస్వతి, దుర్గ పూజలు వైభవంగా చేపట్టారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో నవదుర్గ వేషధారణలు ధరించి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత డాక్టర్ తేజోమూర్తి మాట్లాడుతూ నేటి రోజుల్లో స్త్రీలు అనేక రంగాలలో రాణిస్తున్నారని, కొందరు అనాగరికంగా ప్రవర్తించిన వాటన్నింటినీ ఎదుర్కొని అమ్మవారి ఆశీస్సులతో స్త్రీలు విజయం సాధించాలని అన్నారు. విద్యాసంస్థల కార్యనిర్వహణాధికారి డాక్టర్ శైలజ మూర్తి మాట్లాడుతూ ముందుగా విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ హిందువుల ముఖ్యమైన పండుగ అని ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజులు దేవీ నవరాత్రులు పదవ రోజు విజయ దశమి కలసి దసరా, దీనినే నవరాత్రి, శరన్నవరాత్రి కూడా అంటారని ఆమె అన్నారు.

కళాశాలలో దసరా వేడుకలు

14 నుంచి 'పల్లె పండుగ'

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఈనెల 14 నుంచి పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాలు నిర్వహించాలని మంగళవారం కలెక్టర్ల వీడియో కాన్ఫెరెన్స్‌లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ 14వ తేదీ నుంచి 20వ తేదీవరకు 'పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు' నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. మంగళవారం అన్ని కలెక్టర్లతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. గ్రామీణ కుటుంబాలకు నివాసం ఉంటున్న గ్రామాలలో ఏడాదిలో కనీసం 100 రోజులు వేతన ఉపాధి కల్పించటం, సుస్థిర ఆస్తుల ఏర్పాటు చేసి జీవనోపాధులు మెరుగు పరచటం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఫార్మ్ పాండ్లు, గోకులాల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యం ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనుల్లో పండ్ల తోటలు, ఫార్మ్ పాండ్లు, గోకులాలు వంటి ఆస్తుల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నీటి ఎద్దడి గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో చెక్ డ్యాంలు, కుంటలు నిర్మించి భవిష్యత్తులో నీటి ఎద్దడి లేకుండా చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ సంస్థల భవనాలలో పూర్తిస్థాయి నాణ్యత ప్రమాణాలతో రూఫ్ టాప్ హార్వెస్టింగ్ కట్టడాలను నిర్మించాలన్నారు. ఇప్పటికే ప్రారంభించిన పనుల్లో భాగంగా సిమెంట్ రోడ్లు, డ్రైన్లు, రోడ్లను సంక్రాంతి నాటికి పూర్తి చేసి పెద్ద ఎత్తున అన్ని గ్రామాల్లో మళ్లీ ఘనంగా పల్లె పండుగ నిర్వహించుకుందామని కలెక్టర్లకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అనంతరం.. కలెక్టర్లతో మాట్లాడి జిల్లాల్లో పరిస్థితులను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇసుక, సిమెంట్ తదితర విషయాల్లో వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణతేజ, పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, డ్వామా పీడీలు, జెడ్పీ సీఈవోలు, జిల్లా పంచాయతీ అధికారులు, ఎంపీడీవోలు, ఉపాధి ఏపీవోలు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సుమిత్‌కుమార్

నిరాశ్రయులకు ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: మెప్మా, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సపోర్ట్ సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహంలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈనెల 10న ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వసతి గృహ నిర్వాహకులు జోసఫ్ రాజ్ తెలిపారు. వైద్య శిబిరంలో డాక్టర్ ప్రశాంతి వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సెంటర్ సూపర్వైజర్ పవనమ్మ, ఏఎన్ఎం కవిత, ఆశా వర్కర్ రాధా, వసతి గృహ సిబ్బంది ప్రమీల, ఇంద్రాణి, శశిరేఖ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

పశు గర్భకోశ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-సదుం: పశు గణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో సదుం పశు వైద్యాధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మంగళవారం యర్రగుంట్లవారి పల్లిలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. 90మందికి పైగా పాడి రైతులు తమ పశువులకు వైద్య చికిత్సలు చేయించారు. గర్భకోశ వ్యాధులు, పిడిదులు నివారణకు సంబంధించి రైతులకు డాక్టర్లు అవగాహన కల్పించారు. అనంతరం మినరల్ మిక్సర్ ప్యాకెట్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటరమణారెడ్డి, మునిరెడ్డి, పశు వైద్య సిబ్బంది జగదీశ్, అలీ, గౌతమ్, నందు, మురళి, మునీంద్ర, మునికేశవులు, విష్ణు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-2025 విద్యా సంవత్సరానికి గాను స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద మంగళవారం ప్రకటనలో తెలిపారు. కళాశాలలో డిగ్రీ ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఇంటర్మీడియట్ తత్సమాన విద్యార్హత కలిగిన విద్యార్థులు కళాశాలలో చేరేందుకు అందుబాటులో ఉండే వివిధ కోర్సులు, బిఏ హానర్స్ ఎకనామిక్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ బాటనీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ గ్రూపులన్నీ అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో చేరదలిచిన వారు సంబంధించిన సర్టిఫికెట్లన్నీ ఒరిజినల్‌తో పాటు రెండు సెట్లు జిరాక్స్ కాపీలతో కళాశాలలో ఈ నెల 10వ తేదీ లోపు సంప్రదించాలన్నారు. వివరాలకు.. భరణి నాథ్ రెడ్డి 9885125771, నరేంద్ర బాబు 7702917803, భీమ మోహన రావు 9704425888 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యే చొరవ.. నీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర శివారులోని 22వ వార్డుకు చెందిన గంగా కాలని (తేన బండ)లో కలుషిత నీటి వలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ విషయం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ దృష్టికి రావడంతో మంగళవారం నూతనంగా మంచి నీటి బోరు వేయించి సమస్యను పరిష్కరించారు. స్థానిక ప్రజలు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా తమ ప్రాంతంలో నీరు మురుగు కాలువ వలన కలుషితమైందని తద్వారా తమ ఊరిలోని చిన్న వయసు పిల్లల నుంచి పెద్దల వరకు తరచూ చర్మ సంబంధిత వ్యాధులు వ్యాప్తి చెందాయని దీని కారణంగా అనేక సమస్యలు ఎదుర్కొన్నామన్నారు. కానీ ఇటీవల తమ ప్రాంతంలో పర్యటించినప్పుడు ఎమ్మెల్యే ఇచ్చిన మాట ప్రకారం నీటి బోరు వేయించి తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

కృతజ్ఞతలు తెలుపుతున్న కాలనీ వాసులు

సోమలలో భారీ ఉరుములు, మెరుపులతో వర్షం

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల పరిసర ప్రాంతాలలో మంగళవారం సాయంత్రం భయంకరమైన ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. ఏడు గంటల ప్రాంతంలో చిరుజల్లులతో మొదలై ఉరుములు మెరుపులతో ఆకాశం భయానకంగా మారింది. 7:37 నిమిషాలకు ఒక్కసారిగా భారీ శబ్దంతో పిడుగు పడటం వెంటనే విద్యుత్ సరఫరా ఆగిపోయింది. అయితే ఎక్కడ పిడుగు పడింది అన్న విషయం తెలియరాలేదు. ఉదయం నుంచి సూర్య కిరణాలు తీవ్రంగా ఉంటూ ఉక్కపోతకు ప్రజలు గురవుతూ వచ్చారు. సాయంత్రం ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో వాతావరణం చల్లదనాన్ని పరుచుకుంది. రైతులు వర్షం పడటం వల్ల తమ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎరువులు మోతాదు మించొద్దు

- తగిన మోతాదులోనే ఎరువు వాడాలి
- సేంద్రియ ఎరువులు అధికంగా వాడాలి
- ఏవో రజినికుమారి

ప్రజాశక్తి-విజయపురం: పంటకు ఘన, ద్రవ ఎరువులు, పచ్చిరొట్టి, పచ్చి ఆకు ఎరువులు, జీవన ఎరువులు ముఖ్యపోషకాలు, పంట ఎదుగుదలకు సుమారు 16 రకాల పోషకాలు అవసరం. వీటిలో నత్రజని, భాస్వరం, పోటాషియం, ఎక్కువ మోతాదులో అవసరమవుతాయి. ఉప పోషకాలైన క్యాలియం, మెగ్నీషియం, గంధకం తక్కువ మోతాదులో అవసరం. ఇనుము, మాంగనీస్, రాగి, జింకు, బోరాన్, క్లోరిన్, అల్యూమినియం, నికేల్, మొదలైన సూక్ష్మపోషకాలు కూడా పంటకు తక్కువ మోతాదులోనే అవసరమవుతాయి. కానీ రైతులకు అవగాహన లేక మోతాదుకు మించి వేస్తుంటారని, దీని వల్ల ఫలితం ఏ మాత్రం ఉండకపోవడంతో పాటు అదనపు ఖర్చు అవుతుందని ఏవో రజినికుమారి తెలిపారు. ఏ ఎరువు ఎందుకు ఉపయోగ పడుతుందోనని వివరాలను ఆమె పూర్తిగా వివరించారు.

పొటాషియం

మొక్కల్లో జరిగే జీవ రసాయన క్రియలను ఎంజైమ్‌ల తయారీకి పొటాషియం, అవసరం. మొక్కకు రోగనిరోధక శక్తిని ఇస్తుంది. పురుగు తెగులు ఆశించకుండా కాపాడుతుంది. వాతావరణ ప్రభావాల నుంచి పంటను రక్షించడమే కాకుండా కాయలు, గింజలు పండ్ల నాణ్యత పెరుగుతుంది.

భాస్వరం

భాస్వరంతో వేర్ల పెరుగుదలకు గింజకట్టడుతుంది. మొక్క పెరుగుదలకు కొమ్మలు తొడగటానికి అవసరం. నేలలోని సేంద్రియ పదార్థం చివికేల చేస్తుంది. ప్రొటీన్, ఎంజైమ్‌ల తయారీకి ఉపయోగపడుతుంది. పుష్పజాతి పంటలకు ఎక్కువ భాస్వరం అవసరం.

మెగ్నీషియం

మెగ్నీషియంతో ఎంజైమ్‌ల చురుకుదనం కలిగిస్తుంది. నేలలోని భాస్వరం గ్రహించడంలో తోడ్పడుతుంది.

పచ్చిరొట్ట ఎరువులు

పంటకు అవసరమయ్యే పోషకాలు సేంద్రియ రూపంలో సమర్థవంతంగా అందించాలంటే పచ్చిరొట్టను భాగా అందించే పంటలను అదేపొలంలో ముందుగా వేసుకోవాలి. తక్కువ వనరులతో భాగా పెరిగిన పంటలను సుమారు రెండు నెలల ముందే పొలంలో విత్తుకోవాలి. ఆ పంట పూతకు వచ్చే సమయంలో భూమిలో కలియదున్నాలి. దున్నిన రెండుమూడు వారాలకు బాగా కుళ్లటం వల్ల విడుదలైన పోషకాలు పొలంలో విత్తిన పంటకు అందుతాయి. ఉదాహరణకు మినుము, అలసంద, జీలుగ, పెసర, ఉలువలు, బఠాని, పిల్లిపెసర, జనుము.

నత్రజని

నత్రజని మొక్కల జీవిత కాలమంతా అవసరమే. మొక్క పెరుగుదలకు దుగ్గు కట్టడానికి అవసరం. నత్రజనితో ప్రొటీన్ శాతం పెరుగుతుంది.

పచ్చి ఆకు ఎరువులు

పచ్చిరొట్ట వేసుకోవడం కుదరని పరిస్థితిలో దగ్గరలో ఉన్న చెట్ల ఆకులను, లేతకొమ్మలను తీసుకొని వచ్చి పొలంలో కలుపు కోవచ్చు. పచ్చిఆకు ఎరువుకు అనువైన పంటలు జిల్లెడు, సీతాఫలం, వెంపలి, తంగేడు, తగరంచ, బాడిషా, తదితర మొక్కలను చేలో వేసుకోవచ్చు. వరి పొలాల్లో వేసుకునేందుకు అనువైన పప్పు ధాన్యాలు-పెసర, అలసంద, శనగ, సోయా చిక్కుడు, వేరుశెనగ, కంది.

శాప్ ఛైర్మన్‌ను కలిసిన వీసీ


రవినాయుడును కలిసిన వీసీ

ప్రజాశక్తి-గుడిపల్లి: శాప్ ఛైర్మన్ రవినాయుడును ద్రావిడ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ దొరస్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా శుభాభినందనలు తెలిపారు.

గుండెపోటుతో ఆర్‌ఎంపి డాక్టర్ మృతి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని గోవిందవారిపల్లె గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ బలరామిరెడ్డి (37) మంగళవారం గుండెపోటుతో మృతిచెందారు. ఈయన పచ్చికాపల్లంలో ఆర్‌ఎంపీ వైద్యులుగా సేవలందిస్తున్నారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని నంజంపేట పంచాయతీ సరస్వతీ పురంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లాలోని 15 మండలాల నుంచి వివిధ కేటగిరీలకు సంబంధించిన సిబ్బంది సరస్వతీ పురం గ్రామంలోని రామిశెట్టి మహేష్ కుమార్ పొలంలో ప్రకృతి వ్యవసాయ శిక్షణ తరగతులకు హాజరైయ్యారు. వివిధ రకాల పంటల సాగు, చీడపీడల నివారణ పద్ధతులు తదితర అంశాలపై డాక్టర్ పుష్ప శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు శాస్త్రవేత్తలు 15మంది, మెంటార్ ఇంటర్న్‌లు 7మంది, మెంటర్లు 3 మొత్తం 25మంది శిక్షణ పొందారు.

యాంత్రిక పద్ధతులను వివరిస్తున్న శాస్త్రవేత్తలు

వి కోట ఎంపీడీవోకు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి-వి కోట: వి కోట ఎంపీడీవోగా సుమారు ఏడాది పాటు విధులు నిర్వాహించి ఇటీవల పిచ్చాటూరుకు బదిలీపై వెళ్లిన ఎంపీడీవో మహ్మద్ రఫీ సేవలు మరువలేనివని మాజీ ఏఎంసీ చైర్మన్ రామచంద్ర నాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఎంపీడీవోకు ఘనంగా వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎంతో నేర్పుతో వీకోటలో పనిచేసారని కొనియాడారు. బదిలీపై వెళ్తున్న ఆయనను మండల పరిషత్ సిబ్బంది అఖిలపక్షం నాయకులు ఘనంగా సన్మానించారు. మంగళవారం మధ్యాహ్నం మండల పరిషత్ కార్యాలయంలో నాయకులు, అధికారులు సిబ్బంది ఘనంగా సన్మానించారు.

నామినేటెడ్ పదవుల కోసం నేతల ప్రయత్నాలు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ప్రభుత్వ నామినేటెడ్ పదవుల కోసం బయోడేటాను అందజేయడానికి జీడీ నెల్లూరు మండల టిడిపి నేతలు అమరావతికి తరలివెళ్లారు. కేంద్ర టీడీపీ కార్యాలయంలో మల్లికార్జున్ రావుకు మండలంలోని తూగుండ్రం దళితవాడకు చెందిన పార్లమెంట్ టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం, కార్వేటినగరం మండలానికి చెందిన పార్లమెంట్ టిడిపి ముస్లిం మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సంధాని, నియోజకవర్గ టిడిపి బీసీ సెల్ అధ్యక్షుడు రవి యాదవ్, పదవులను కేటాయించాలని కోరుతూ బయోడేటాలు అందజేశారు. వీరితోపాటు ఆత్మకూరు పంచాయతీ టిడిపి ప్రధాన కార్యదర్శి రాజా పాల్గొన్నారు.

టీడీపీ కేంద్ర కార్యాలయంలో నాయకులు

'ఆరోగ్య సేవల పనితీరు మెరుగు పరుచుకోవాలి'

దొరవారిసత్రం: ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో పనిచేస్తున్న ఎంఎల్ హెచ్‌పి, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు అందించే ఆరోగ్య సేవల పనితీరు మెరుగుపరచుకోవాలని వైద్యాధికారి చైతన్య సూచనతో కూడిన హెచ్చరిక చేశారు. మంగళవారం దొరవారిసత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలవారీ నిర్వహించే ఆశా డే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, వారికి పలు సూచనలు చేశారు. ప్రధానంగా మనం ప్రజలకు అందించే హెల్త్ పారామీటర్స్ పర్సంటేజీ తక్కువ స్థాయిలోకి ఉండకుండా, అందరూ చేస్తున్న ఆరోగ్య సేవలను ఎప్పటికప్పుడు ఆన్‌లైనులో నమోదు చేయాలని సూచించారు. మాతా శిశు సంరక్షణ సేవల విషయంలో ప్రభుత్వం ప్రధాన దృష్టి పెడుతుందని, ఏ ఆరోగ్య కార్యకర్త అయినా వారి పనితీరులో లోపం కనిపిస్తే అధికారులు చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. పిహెచ్‌సిలో పనిచేసే సిబ్బందితో పాటు, క్షేత్రస్థాయిలో పనిచేసే ఆరోగ్య సిబ్బంది కూడా పని వేళలు పాటిస్తూ యూనిఫామ్ ధరించి పని చేయాలన్నారు. నిర్లక్ష్యం వహించి అలసత్వంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండవ శనివారం,సెలవు దినమైన సచివాలయ ఏఎన్ఎంలు, విధిగా వ్యాధి నిరోధక టీకాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలకు "మాత శిశు సంరక్షణ " అనే అంశంపై ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు చంద్రకళ, సి హెచ్ ఓ సంపూర్ణమ్మ, హెల్త్ విజిటర్ మైధిలి, ఎంఎల్‌హెచ్ పి, ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ దేవి అవతారంలో బంగారమ్మ

మహాలక్ష్మీ దేవి అవతారంలో బంగారమ్మ

ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసిన బంగారమ్మ దేవి ఆలయంలో మంగళవారం దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మహాలక్ష్మీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, అలంకరణ చేసి దర్శన ఏర్పాట్లు చేశారు. ఉభయదారులుగా మధు, టీచర్ రవి రెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రంగనాథ మొదలి, కార్యదర్శి చంద్రశేఖర్, భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా నైనేరమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు మహాలక్ష్మీ దేవి అవతారంలో దర్శనమిచ్చారు.

బంగారుపాళ్యం: మండలంలోని బొమ్మయపల్లి పంచాయతీ వజ్రాలపురం బోయకొండ గంగమ్మ, మండల కేంద్రంలోని ముత్యాలమ్మ దసరా ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు మంగళవారం అమ్మవారు మహాలక్ష్మి దేవి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఎస్ఆర్ పురం: మండలంలోని ఆరిమాకులపల్లి గ్రామంలో వెలసిన అరిమానిగంగమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలలో భాగంగా ఆరవ రోజు మంగళవారం అమ్మవారు మహాలక్ష్మి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకం కార్యక్రమానికి ఉభయ దారులుగా సులోచనమ్మ, గంగన్న శెట్టి, కోనేటం పేట తమిళనాడు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ అర్చకులు వెంకటాచలపతి ప్రాతఃకాలార్చన హారతి అభిషేకం, హోమం, మహా మంగళహారతి ఇచ్చి, భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

తగ్గేదేలే..!

- భారీగా పెరిగిన కూరగాయల ధరలు..
- వర్షాలతో తగ్గిన దిగుమతి
- కేజీ ఉల్లిపాయలు రూ.50పైనే
- ధరలు పెంచిన వ్యాపారులు
- సామాన్యులకు తప్పని తిప్పలు

మార్కెట్లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి.. దాదాపు అన్ని కూరగాయలూ సెంచరీ మార్క్‌కు చేరువ అవుతున్నాయి. ధరలతో సామాన్యులు తిప్పలు పడుతున్నారు.. రూ.500లు తీసుకెళ్తే ఐదారు రకాల కూరగాయలు తెచ్చుకోవడం కష్టంగా మారింది. పెరుగుతున్న ధరతో వినియోగదారులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. కానీ కూరగాయల ధరలు మాత్రం.. తగ్గేదేలేదంటూ భారీగా పెరుగుతున్నాయి.

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: కొత్తిమీర రేటు కొండెక్కింది.. పప్పులో వేసుకునే పాలకూర ధర సైతం బాగా ప్రియమైంది.. వీటితో పాటు నిన్న, మొన్నటి వరకు అన్ని వర్గాల ప్రజలకూ అందుబాటులో ఉన్న బెండకాయ, దొండకాయ, వంకాయ, బీర, సొరకాయ తదితర కూరగాయల ధరలు సైతం క్రమేపీ పెరుగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఉల్లి ధర కూడా రోజురోజుకూ పెరుగుతోంది. ఉల్లి ధర టన్ను రూ.51వేలు పలికి ఆరునెలల గరిష్టానికి చేరింది. అక్కడ కిలో రూ.51లు పలుకుతుండగా బహిరంగ మార్కెట్లో కిలో రూ.60లు అమ్ముతున్నారు. పప్పు, ఉప్పు కంటే ఆకుకూరల ధరలు భారీగా పెరిగిపోతుండడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో వివిధ రకాల కూరగాయల దిగుమతి బాగా తగ్గింది. మరీ ముఖ్యంగా ఆకుకూరలు, పాలకూర, కొత్తిమీర, పుదీనా లాంటివి ఆశించిన మేరకు దిగుబడి రాకపోవడంతో పాటు దేవీ నవరాత్రుల సందర్భంగా నిర్వహిస్తున్న అన్నదానాల నేపథ్యంలో సరుకు ధరలు అడ్డగోలుగా పెంచేసి దోచుకుంటున్నారు వ్యాపారస్తులు. సాధారణంగా మార్కెట్లలో ఇతర కూరగాయలతో పోల్చితే ఆకుకూరల రేట్లు అన్ని వర్గాల ప్రజలకూ కాస్తంత అందుబాటులో ఉంటాయి. రూ.30లు పెడితే నాలుగు నుంచి ఆరు కట్టల ఆకు కూరాలు వచ్చేవి. ఇక కొత్తిమీర, పుదీనా కట్టలు రెండు, మూడు వచ్చేవి. కానీ ఇప్పుడా పరిస్థితే లేదు. చిన్నసైజు పాలకూర కట్ట ధర రూ.20ల వరకు చెబుతున్నారు. పది రూపాయలకు కొత్తిమీర అడిగితే ఇచ్చేదే లేదంటున్నారు. మార్కెట్లలో అయితే నాలుగు కట్టల పాలకూర రూ.100లకు పైమాటే రూ.500 పట్టుకునివెళ్తే కనీసం నాలుగైదు రకాల కూరగాయలు కూడా రావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయలరేట్లు మరో వారంలోగా దిగి వచ్చే అవకాశం ఉందని మార్కెట్ అధికారులు చెబుతున్నారు. వర్షాల కారణంగానే ఆకుకూరల దిగుమతి తగ్గిందని చెబుతున్నారు. రైతుబజార్లకు సరుకు రాకుండా కొంతమంది కూరగాయలను నేరుగా రైతుల దగ్గర కొనుగోలు చేసి రవాణా ఛార్జీలను సాకుగా చూపి సామాన్యులకు కూరగాయలు అందకుండా చేస్తున్నారని ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

కూరగాయల ధరలు ఇలా..

చిక్కుడు రూ.80 -100	టొమాటో రూ.31
వంకాయ రూ.35	బెండకాయ రూ.45
క్యారెట్ రూ.60	దొండకాయ రూ.45
ఉల్లిగడ్డ రూ.54	క్యాప్సికమ్ రూ.70
పాలకూర కట్ట రూ.30	కొత్తిమీర రూ.30

పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

- డాక్టర్ దుర్గాదేవి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ దుర్గాదేవి సూచించారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశా వర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి సూచనలు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శ్రీనివాసులు, సిబ్బంది ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి కృషి: నారాయణ మూర్తి

బాధ్యతలు స్వీకరిస్తున్న నారాయణ మూర్తి

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులుగా నారాయణ మూర్తి బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ జింకా లక్ష్మీ నారాయణ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ పొందిన అనంతరం వైస్ ప్రిన్సిపల్‌గా ఉన్న నారాయణమూర్తిని ఎఫ్‌ఏసిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. పదవి బాధ్యతలు స్వీకరించిన నూతన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రుల సహాయ సహకారాలతో కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

పెద్దపంజాణి ఎంపీడీవోగా బాలాజీ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండల ఎంపీడీవోగా బాలాజీ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న అబ్దుల్ రహీం కలకడకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాలాజీ మాట్లాడుతూ గతంలో మండలంలో పనిచేసిన అనుభవంతో ప్రజా ప్రతినిధులు, ప్రజలతో కలిసి మండలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని కొత్తపల్లి పంచాయతీ 49 కొత్తపల్లి మిట్ట వాణిజ్య కూడలి, చిత్తూరు - పుత్తూరు జాతీయ రహదారిలో తాగునీటి పైపు పగిలిపోయి గ్రామస్తులకు నీటి సమస్య ఏర్పడింది. గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో గ్రామస్తులు నీటి సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన సర్పంచ్ సమస్యను పరిష్కరించారు. గ్రామస్తులు సర్పంచ్‌ని అభినందించారు.

నాట్యంతో అలరించిన హర్షిత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దసరా ఉత్సవాల సందర్భంగా కొత్తపేట సీతాలమ్మ ఆలయం వద్ద మంగళవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇందులో భాగంగా పట్టణానికి చెందిన పాత్రికేయుడు, మీసేవ నిర్వాహకుడు సూర్యకుమార్ హర్షిత తన భరత నాట్య ప్రదర్శనతో భక్తులను ఆకట్టుకుంది. శంకర శ్రీగిరి దుర్గా కవిత్వం, హనుమాన్ చాలీసా, గణేశ పంచరత్నం, తీరాద విలయాటు పిల్లై తదితర భక్తి పాటలకు తనదైన శైలిలో నాట్యం చేసి వీక్షకుల ప్రశంసలు అందుకుంది. అనంతరం హర్షితను నిర్వాహకులు షీల్డ్, సర్టిఫికెట్ అందజేశారు.

నాట్యం చేస్తున్న హర్షిత

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE (JUNIOR DIVISION) :: PUTTUR
I.A.No: 1236 OF 2023
O.S.NO. 355 OF 2023

BETWEEN:
1. Smt T.Jilakaramma,
2. T.Gangi Reddy...**Petitioners/Plaintiffs**

AND:
T.Venkata Reddy ...**Respondent/Defendant**

SUMMON AND NOTICE TO DEFENDANT/RESPONDENT

D/R: T.Venkata Reddy, S/o Late T.Chenga Reddy @ Bakki Reddy, Hindu, aged about 49 years, agriculturist, residing at: Perumalla Palli Village and Post, Vedurukuppam Mandal, Chittoor District.

The Plaintiff/Petitioner filed a suit against you for partition plaint schedule properties to Plaintiffs, the above I.A.No:1236/2023, O.S.NO:355/2023 is posted for your appearance before this Hon'ble court on 22/10/2024 in person or through your advocate at about 10:30 am, and file your objection if any otherwise the matter will be decided Ex-Party.

Date of hearing: 22/10/2024
Sri K.MURALI REDDY, B.Com., M.A., M.B.A., L.L.M.,
Advocate/Puttur.
Contact.No:9849979898, 9492422949.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE CUM J.F.C.M: PUTTUR (JUNIOR DIVISION)
I.A.No. 2863 / 2022
O.S.No. 38/2018

Between:
T. Rajarathnam Naidu and another ...**Petitioners**
And:
K. Purushotham Naidu and others ...**Respondents**

NOTICE TO THE RESPONDENTS/ PROPOSED PARTIES NO.5.7 AND 8 BY WAY OF PUBLICATION

To
R5. Yoganandam, S/o.K.Purushotham,
R7. Lavanya, W/o.Gurappa Naidu,
R8. Vijaya, D/o. Purushotham Naidu,
All are residing at Perumal Naidu Kandriga Village, H/o Krishnazimma puram Village, S. RKandriga Post, Palasamudram Mandal, Chittoor Dist., A.P.

Please take notice that the above petition in I.A.No.2863/2022, for implead the legal heirs of deceased 3rd Defendant namely K. Renuka as Respondents/Defendants 5 to 8 and suit filed against the defendants for Permanent Injunction over the plaint schedule mentioned property same is posted to 16-10-2024 for your notice. If you have got any objections you may appear before the above said Court at 10.30 A.M. on 16-10-2024 either in person (or) through an Advocate and file your objections, if you fail to do so, the matter will be decided exparte.

Sri Gali Ramesh, B.Com., B.L.,
Advocate, Puttur

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE CUM J.F.C.M: PUTTUR (JUNIOR DIVISION)
I.A.No. 2862 / 2022
O.S.No. 38/2018

Between:
T. Rajarathnam Naidu and another ...**Petitioners**
And:
K. Purushotham Naidu and others ...**Respondents**

NOTICE TO THE RESPONDENTS/ PROPOSED PARTIES NO.5.7 AND 8 BY WAY OF PUBLICATION

To
R5. Yoganandam, S/o.K.Purushotham,
R7. Lavanya, W/o.Gurappa Naidu,
R8. Vijaya, D/o. Purushotham Naidu,
All are residing at Perumal Naidu Kandriga Village, H/o Krishnazimma puram Village, S. RKandriga Post, Palasamudram Mandal, Chittoor Dist., A.P.

Please take notice that the above petition in I.A.No.2862/2022, for implead the legal heirs of deceased 3rd Defendant namely K. Renuka as Respondents/Defendants 5 to 8 and suit filed against the defendants for Permanent Injunction over the plaint schedule mentioned property same is posted to 16-10-2024 for your notice. If you have got any objections you may appear before the above said Court at 10.30 A.M. on 16-10-2024 either in person (or) through an Advocate and file your objections, if you fail to do so, the matter will be decided exparte.

Sri Gali Ramesh, B.Com., B.L.,
Advocate, Puttur

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE CUM J.F.C.M: PUTTUR (JUNIOR DIVISION)
I.A.No. 2864 / 2022
O.S.No. 38/2018

Between:
T. Rajarathnam Naidu and another ...**Petitioners**
And:
K. Purushotham Naidu and others ... **Respondents**

NOTICE TO THE RESPONDENTS/ PROPOSED PARTIES NO.5,7 AND 8 BY WAY OF PUBLICATION

To
R5. Yoganandam, S/o.K.Purushotham,
R7. Lavanya, W/o.Gurappa Naidu,
R8. Vijaya, D/o. Purushotham Naidu, All are residing at Perumal Naidu kandriga village, H/o Krishnazimmapuram Village, S.RKandriga Post, Palasamudram Mandal, Chittoor Dist.,

Please take notice that the above petition in I.A.No.2864/2022, for implead the legal heirs of deceased 3rd Defendant namely K. Renuka as Respondents/Defendants 5 to 8 and suit filed against the defendants for Permanent Injunction over the plaint schedule mentioned property same is posted to 16-10-2024 for your notice. If you have got any objections you may appear before the above said Court at 10.30 A.M. on 16-10-2024 either in person (or) through an Advocate and file your objections, if you fail to do so, the matter will be decided exparte.

Sri Gali Ramesh, B.Com., B.L.,
Advocate, Puttur